"దటీజ్ కృషి" వెంటనే అంది మళ్ళీ "ఇంతవరకూ మనమధ్య బేరీజు వేసుకుంటే నువ్వే ఎక్కువ నష్టపోయావవ్ చౌదరీ. ఈ సత్యం నీకీపాటికే తెలిసే వుండాలి."

"అందుకే నిన్ను శాశ్వతంగా నష్టపరచాలని విశ్వాని నీ ఇంటికే పంపేను."

"కాని ఏం సాధించగలిగాడు?"

"ఇంకా వ్యవధి వుంది"

"అని నువ్వనుకుంటే చాలదు చౌదరీ. నువ్వు ధైర్యవంతడివేమో కాని తెలివైన వాడివి కావు"

"ఎందుకలా అనిపించింది"

"ఓ జోక్ చెబుతాను విను"

నిద్ర లేపిన కృషి ఇప్పుడింత ప్రశాంతంగా మాట్లాడుతుంటే చౌదరికి చిర్రెత్తుకొస్తున్నా నిభాయించుకున్నాడు.

"నీలాంటి ఓ తెలివైన వాడిననుకునే ఓ చౌదరి, ఇంకో స్కూలు విద్యార్థి, డాక్టరు ముగ్గురూ ఓ విమానంలో ప్రయాణం చేస్తున్నారట, హఠాత్తుగా విమానం ప్రమాదంలో చిక్కుకుంది. విమానం నడుపుతున్న పైలెట్ కాక్‌పిట్‌లో నుంచి బయటకివచ్చి ముగ్గురితో అన్నాడట."

"ఏమని" వ్యగ్యంగా అడిగాడు చౌదరి.

"విమానంలో రెండు పేరాచ్యూట్స్ వున్నాయి. మీ ముగ్గురిలో ఇద్దరు మాత్రమే వాటి సహాయంతో దూకి ప్రాణాలు కాపాడుకోవచ్చని- అంతే అందిన ఓ పేరాచ్యూట్‌తో చౌదరి దూకేసాడు. తర్వాత డాక్టరు దూకేసాడు తర్వాత స్కూలు విద్యార్థి దూకటానికి ప్రిపేరవుతున్నాడు అప్పుడు పైలెట్ అన్నాడు విద్యార్థితో. 'నువ్వెలా నీ ప్రాణాలు కాపాడుకుంటావూ' అని. పేరాచ్యూట్ వుందిగా అంటూ చూపించాడట స్కూలు విద్యార్థి. నేను ఇచ్చినవి రెండే పేరాచ్యూట్స్‌గా అన్నాడు పైలట్, మూడోది ఎక్కడనుంచి వచ్చిందో అర్థం కాక. డాక్టర్ పేరాచ్యూట్ సాయంతోనే దూకాడు గాని మొదట దూకిన చౌదరి మాత్రం నా స్కూలు బేగ్‌ని పేరాచ్యూట్‌గా భ్రమపడి దానితోనే దూకేసాడని చెప్పాడా విద్యార్థి."

అతని మొహంలో రంగులు మారేయి.

"అంటే ఆ తర్వాత చౌదరి ఫేట్ ఏమైవుంటుందో ఈపాటికి నీకు అర్థమై వుండాలి మిస్టర్ చౌదరీ. . . దీన్ని బట్టి నీది ఎంత తెలివితక్కువ దూకుడో తెలిసిపోతూందిగా. చెప్పొచ్చేదేమిటంటే నువ్విప్పుడు ఖచ్చితంగా అలాంటి సమస్యలో ఇరుక్కున్నావు."

"క్లియర్‌గా చెప్పక. . ." పళ్ళునూరేడు చౌదరి.

"రేపు ఉదయం దాకా ఆగితే నీకే అర్థమౌతుంది." క్షణం ఆగి అంది కృషి. "పాపం టెన్షన్‌కి గురవుతున్నట్టున్నావ్ కదూ. . . అయితే విను. నువ్వు నీ కొడుక్కి ఓ సెంట్రల్ మినిస్టర్ కూతురితో పెళ్ళి సెటిల్ చేసినట్టున్నావ్. బహుశా అలాంటి సంబంధంతో నీ ఎంపైర్‌ని

చేశాడు. మోసగించబడిన ఆ అమ్మాయి ఆత్మహత్యకి సిద్ధపడితే నేను కాపాడి జరిగిన వ్యవహారం గురించి పోలీసుల దగ్గర స్టేట్‌మెంట్ ఇప్పించాను. సో. . నీ కొడుకు ఇప్పుడు ఆ అమ్మాయినే పెళ్ళి చేసుకోవాలి."

హఠాత్తుగా నిశ్శబ్దం ఆవరించింది.

"ఏం చౌదరీ. గొంతు పెగలడం లేదా"

"నువ్వు చెప్పిన వ్యవహారం నాకు తెలీనిది కాదు"

"మరిప్పుడేం చేయాలనుకుంటున్నావ్".

జవాబు చెప్పలేకపోయాడు వెంటనే. అదికాదు చౌదరి ఆ క్షణంలో ఆలోచిస్తున్నది. తన సామ్రాజ్యానికి సంబంధించిన ఆనుపానులే గాక తన కుటుంబానికి చెందిన వ్యక్తుల కదలికల్ని కూడా ఆమె గమనిస్తూంది. వాటి పరంగా తనపై దండ యాత్రకి ప్రిపేరవుతూంది. ఇంతవరకూ వెళ్ళిన కృషి ఇక విడిచిపెట్టదు. ఏదో రాద్ధాంతం చేస్తుంది. అసలు 'జీవిత లాంటి శత్రుశేషం మిగిలివుండడమే ఈ అనర్థానికి కారణం' అని చౌదరి ఆ క్షణంలో అనుకుంటే అది అతడి తప్పుకాదు.

"జీవితకి నువ్వు హాని చేయలేవు చౌదరీ. . . ఎందుకంటే మీవాడు రాసిన ప్రేమలేఖలు ఇప్పుడు జీవిత దగ్గర భద్రంగా వున్నాయి ఇప్పుడు నువ్వు తెలివైనవాడిలా తొందరపడటం ఇందాక నేను చెప్పిన జోక్‌లో చౌదరి సూట్కేస్‌బేగ్‌తో విమానంలోంచి దూకడమవుతుంది. సో...సెంట్రల్ మినిస్టర్ కూతురు సంబంధాన్ని పక్కకిపెట్టి జీవితని కోడలుగా చేసుకుంటే బ్రతికిపోతావ్"

ఫోన్ క్రెడిల్ చేసిన చప్పుడు. . .

అప్పటికే చౌదరికి ముచ్చెమటలుపోసాయి. తన స్థాయివాడికి ఆ సమస్య చాలా చిన్నది కావచ్చు. కాని ఇప్పుడు జటిలంగా మారిపోయింది. విషం సీసాలో వున్నంతసేపూ ప్రమాదం కాదు. గొంతులోకి దిగితేనే ప్రాణ హాని కలిగించేది. ఇప్పుడు ఆ చిన్న సమస్య కృషిదాకా వెళ్ళడంతో గొంతుదిగి కంగారు పుట్టించేదిగా మారిపోయింది.

ఆ రాత్రి రామనాథచౌదరి నిద్రపోలేదు..... సమస్య పరిష్కారానికి ఏ మార్గం అనుసరించాలీ అన్న మీమాంసలో తెల్లవార్లూ గడిపాడు.

ఉదయమే లాయర్ రంగధాంతో ఆ విషయం చర్చించాలనుకున్నాడు. కనీసం ఎమ్మెల్యే రాజారావు సహాయంతో ఏదన్నా చేయాలనుకున్నాడు. కాని కృషిని ఎదుర్కోటానికి మరేదో అనూహ్యమైన మార్గాన్ని వెదకాలని నిర్ణయించుకుని ఇద్దరితోనూ సంప్రదించడం మానేశాడు.

ఇక్కడ చౌదరి కొడుకు చేసిన తప్పు గురించి ఆలోచించడం లేదు. కృషి పరంగా ఎదురయ్యే యిబ్బంది గురించే ఆందోళన పడుతున్నాడు.

సరిగ్గా ఆ సమయంలో విశ్వా అతడి దగ్గరికి వచ్చాడు.

ఆవేశంగా అనేశాడు విశ్వాని చూడగానే "నువ్వో సమర్థుడివి అని పంపితే ఇంతవరకూ ఒక్క అరంగుళం ముందుకు సాగలేకపోయావ్. అసలు నీ వలన సాధ్యమవుతుందా అని ఇప్పుడు ఆలోచిస్తున్నాను."

"చౌదరిగారూ" హర్టయినట్టుగా చూశాడు విశ్వ "మీ అభియోగానికి మొదటి జవాబు ఇంకా మీరిచ్చిన గడువు పూర్తిగాలేదని . . . ఇకపోతే కృషి అనే ఆడపిల్లని మానసికంగా హింసించడంలో నా పరిధిలు దాటి వెళ్ళాను. ఇంచుమించు ఓ శాడిస్ట్‌లా ఆమెను ప్రతిక్షణమూ హింసిస్తూనే వున్నాను. అయితే కృషి మీరూ నేను అనుకున్నంత బలహీనురాలు కాదు. . . తెలివిలోగాని ధైర్యంలో గాని. . ."

"ఆపేయ్" అర్థోక్తిగా అరిచాడు చౌదరి "నీకోసం అయిదు లక్షలు పెట్టుబడి పెట్టడంలో గాని నిన్నక్కడకు పంపడంలో గాని నా వుద్దేశ్యం కృషిని ఇండియా నుంచి తరిమేయాలని. . . ఆమె గుణగణాల్ని శక్తి యుక్తుల్ని స్టడీ చేయమని గాదు."

విశ్వాకి పట్టలేనంత కోపంవచ్చింది. అతడి అనుచరుడిలానో చేతికింద పనివాడిలానో చౌదరి శాసించడం నచ్చలేదు. అయినా తమాయించుకున్నాడు.

"మీకు కృషి ఈ దేశం నుంచి వెళ్ళిపోవడం కావాలి. అంతేగా"

"యస్"

"ఆ ప్రయత్నంలో మీరు నాకు సహకరించటానికి సిద్ధంగా వుంటానని ముందే మాటిచ్చారు కదూ"

"అవును"

"అయితే ఓ పనిచేయండి" అతని రెస్పాన్స్ కోసం ఎదురు చూడకుండా అన్నాడు విశ్వా. "మీ అబ్బాయి రాజేంద్ర మూలంగా మోసపోయిన జీవితని మీ కోడలుగా చేసుకోండి"

విస్మయంగా చూసాడు చౌదరి. రాత్రి కృషి ఏ ప్రపోజల్ గురించి మాట్లాడిందో యిప్పుడు సరిగ్గా ఆ విషయమే చర్చిస్తున్నాడు విశ్వ.

"మిస్టర్ విశ్వనాథ్" కోపాన్ని దిగమింగుకుంటూ అన్నాడు చౌదరి. " నువ్వు అయిదు లక్షలూ వెనక్కి తిరిగి చెల్లించనవసరం లేదని నేను చెప్పింది నేను చెప్పిన పని నువ్వు చేస్తావని, చేయాలని. . . కాని ఇప్పుడు నువ్వు నేనేం చేయాలో సలహా ఇస్తున్నావ్"

"ఇది సలహా కాదు చౌదరిగారూ. . . ఇండియా విడిచి ఆ కృషి వెళ్ళటానికి తను పెట్టిన షరతు"

"ఆ షరతుకి నేను అంగీకరిస్తే నువ్వేం సాధించినట్టు"

"కోట్లరూపాయల డిఫెన్స్ కాంట్రాక్టు మీకు వచ్చేట్టు చేశాను. మీ మీద ఉద్వేగంగా దూకే కృషి చైతన్యాన్ని పక్కలో బాంబులా నిలబడి సగం అదుపు చేసాను"

"సారీ విశ్వా. నీకూ నాకూ ఒప్పందం నువ్వు కృషి ఈ దేశం వదిలివెళ్ళేట్టు చేయడం. అంతవరకే. [illegible]"

షాక్ తిన్నట్టుగా చూసేడు "అంటే జీవితనే ఓ ఆడపిల్ల జీవితానికి సంబంధించి న్యాయం చేయనంటారు."

"డబ్బుకోసం ఏ గడ్డి అయినా కరిచేవాడు యిలాంటి న్యాయాన్యాయాల గురించి మాట్లాడకూడదు."

చెళ్‌మనిపించింది చౌదరి స్టేట్‌మెంట్. ఒకనాడు కృషి తనగురించి ఎలాంటి అభిప్రాయాన్ని వ్యక్తం చేసిందో ఇప్పుడు చౌదరి అదే చెబుతున్నాడు కాకపోతే కృషిమాటల్లో ఆర్తివుంది. ఇతని స్టేట్‌మెంట్‌లో అధికారం ధ్వనిస్తూంది.

ఒక అవసరంకోసం ఓ సామ్రాజ్య పరిధిలో అడుగుపెట్టిన విశ్ను లాంటి తెలివైనవాడికి అభిమానవంతుడికి ఈ మాత్రం షాక్ చాలు జ్ఞానోదయం కావటానికి తనకున్న వ్యక్తిగతమైన కక్షకి తనను చౌదరి ఆయుధంలా వాడుకుంటున్నాడని ఇంతకుముందే తెలిసినా విశ్నూ ఈ రోజు దాకా ఇంతగా రియాక్టు కాలేదు కారణం విశ్నుకి ఉపాధ్యాయ కుటుంబంపై వున్న కసి....

"ఇంతవరకూ వచ్చింది కాబట్టి ఈ క్షణంలో నేనో విషయం మీకు చెప్పక తప్పదు చౌదరిగారూ" నిర్భీతిగా గొంతులో అణువంత హెచ్చరికని ధ్వనింపచేస్తూ అన్నాడు. "మీకు కావాల్సింది కృషి ఈ దేశం వదిలి వెళ్ళడమే అయితే జీవితకీ రాజేంద్రకీ పెళ్ళిచేయండి. లేదూ మీకు నేను ఐదు లక్షలు చెల్లించడమే ముఖ్యమనుకుంటే. . ."

"చెప్పు"

"ఆ అయిదులక్షలూ కృషినుంచి తీసుకుని మీకు యివ్వాల్సి వస్తుంది"

అప్రతిభుడయ్యాడు చౌదరి " కృషి నీకెందుకిస్తుంది"

"జీవితనే ఓ ఆడపిల్ల జీవితాన్ని నేను చక్కదిద్దితే కృషి నాకు పదిలక్షలైనా ఇవ్వటానికి వెనుకాడదు కాబట్టి."

చౌదరి నుదుట స్వేదం పేరుకుంది. అతడ్ని తెలివిగా కృషే ఈ పనికి నియోగించిందని భోదపడిపోయింది. అంటే తనతో పోరాటానికి విశ్నుని ప్రేరేపిస్తూంది. అదికాదు ఆమె మేధస్సుకి చౌదరి ఆ క్షణాన కంగారుపడింది తను ఈ దేశం వదిలి వెళ్ళటానికి కృషి ఇలాంటి పెళ్ళి అనే కండిషన్ పెట్టడం ద్వారా ఓ ప్రముఖుడితో తను వియ్యమందే అవకాశానికి విఘాతం కలిగించబోతూంది. తన పరపతికి ముప్పు తేబోతుంది. కృషి ఎంత పటిష్టమైన పథకం అమలుచేయబోతున్నది అర్ధమైన చౌదరి తగ్గడం తప్పనిసరన్నట్టుగా ఓ అడుగు వెనక్కి వేశాడు. "చూడు విశ్నూ. . . ఇక్కడ నువ్వు ఆలోచించాల్సిన విషయం మరోటుంది. రాజేష్ పెళ్ళి సెటిలయింది సామాన్యుడి కూతురితో కాదు ఓ కేంద్రమంత్రి బిడ్డతో. అది తెలిసిన కృషి నిన్ను ట్రాప్ చేయబోతూంది"

"ఇది ఓ ట్రాప్‌గా నేను భావించడం లేదు చౌదరిగారూ" కృషి మాటలు అతడిపై ఎలాంటి ప్రభావం చూపించిందీ స్పష్టంగానే వ్యక్తం చేశాడు విశ్ను. "నేను ఉపాధ్యాయ కుటుంబపై

భ్రమించి నా కుటుంబం చిన్నాభిన్న మైందని. ఇప్పుడు మీ అబ్బాయి మూలంగా మరో ఆడపిల్ల జీవితం అన్యాయం కాబోతూంది అంటే మరో కుటుంబం అశాంతికి మీరు కారణమవుతున్నారు అప్పుడు మీకూ ఉపాధ్యాయకీ తేడాలేదు. అలాంటి మీకు నేను సహకరించడంలో అర్థం లేదు."

చౌదరి పిడికిళ్లు బిగుసుకున్నాయి. అయినా నిభాయించుకున్నాడు. "అంటే నా ఒప్పందం కన్నా నీకు కృషి ప్రపోజలే ముఖ్యమంటావు"

"నేను కసితో ఆ కుటుంబంలో అడుగుపెట్టడానికి మీ సహాయం తీసుకున్నవాడ్నే తప్ప డబ్బు తీసుకొని ప్రొఫెషనల్ క్రిమినల్‌గా ఆలోచించే మనిషిని కాదు. దయుంచి ఆ విషయం గుర్తుపెట్టుకోండి. సో. . . నా అయిదులక్షలే అనుకుంటే మీ ప్రత్యర్థిగానైనా ఆ డబ్బుని నన్ను సంపాదించనివ్వండి. మీ నిర్ణయం వెంటనే తెలియ చేయనవసరం లేదు. ఇరవై నాలుగు గంటల టైమిస్తున్నాను"

వెళ్ళిపోయాడు విశ్ను. . .

చౌదరికి చెమట్లుపట్టాయి. ఈ కథ యిలాంటి మలుపు తిరుగుతుందని అతడూహించలేదు. చివరి గెలుపు సరిహద్దులదాకా నడిచిన విశ్ను ఇప్పుడు ఇలాంటి 'అల్టిమేటమ్' ఇవ్వడంతో ఆవేశం హద్దులు దాటుతున్నా ఏం చేయాలి అన్నది వెంటనే స్ఫురించలేదు. . . .

అదిగో సరిగ్గా ఆ సమయంలో రాజేంద్ర వచ్చాడు తండ్రి దగ్గరికి. . .

"అంతా విన్నాను డాడీ"

"నికృష్టుడా. . ." అరిచాడు చౌదరి "నన్ను నాశనం చేసావ్"

నవ్వాడు రాజేంద్ర "నేను నీ కొడుకుని డాడీ. నిన్నెలా నాశనం చేస్తాను. . . జీవితని శాశ్వతంగా కడతేర్చబోతున్నాను"

"అప్పుడు నువ్వు జైల్లో సెటిలైపోతావు"

"ఆ భయం మీకు అక్కరలేదు. . . " క్షణం ఆగి ఓ పథకంలా అన్నాడు "మీరు విశ్ను ప్రపోజల్‌ని అంగీకరిస్తారు. అంటే అతడ్ని పిలిచి ఈ విషయం తెలియచేస్తారు. కాని ఈ లోగా నేను జీవిత మరెక్కడికో పారిపోతాం జంటగా. . . "

"అర్థం కావడం లేదు"

"సింపుల్ డాడ్. ఈ సాయంకాలానికల్లా నువ్వు విశ్నుని పిలిచి జీవితకి నాకూ పెళ్ళి చేయటానికి ఒప్పుకుంటున్నట్టు నీ నిర్ణయం తెలియచేస్తావ్. కాని అప్పటికే నేను జీవితతో కలిసి ఓ హోటల్ రూంలో దాగుని వుంటాం మీ మొండితనంతో బ్రతుకుతో కలిసే అవకాశం లేని మేం యిద్దరం విషం తాగేసి అమర ప్రేమికులమై మిగిలిపోదామనుకుంటాం. . . నిజంగా విషం తాగుతాం కూడా. . . అలా నోరు తెరవకండి . . . తాగిన వెంటనే జీవిత చచ్చిపోతుంది. నేను తాగింది చాలా స్వల్పం కావడంతో హాస్పిటల్లో కోలుకుంటాను.